
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 20 మే 2024 | 5



కమనీయం.. రమణీయం.. సత్యదేవుడి కల్యాణం..

అన్నవరం సత్యదేవుడి కల్యాణం కమనీయంగా.. రమణీయంగా సాగింది. రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మి దివ్య కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. అన్నవరంలో భారీ వేదికపై ఈ వివాహ కార్యక్రమాన్ని నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తజనం హాజరయ్యారు. ఈ పెళ్లికి సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరించగా వారిని పక్కనే మరో వేదికపై ఆశీనులు గావించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, సుగంధభరిత పుష్పపరిమళాలతో ఆ ప్రాంతమంతా కల్యాణ శోభతో నిండింది. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామచంద్రమోహన్, ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్, కలెక్టర్ నివాస్ పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. రాత్రి 10.30 గంటల తర్వాత అమ్మవారి మెడలో స్వామివారు మూడుముళ్లు వేశారు. ఒకరి శిరస్సుపై మరొకరు మంచిముత్యాల తలంబ్రాలు వేసుకుంటూ వేడుక కలిగించారు. పట్టుపీతాంబరాలు, విశేష ఆభరణాలతో నుదుట తిలకం, బుగ్గన చుక్కతో స్వామి,అమ్మవార్లు దివ్యతేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. వివరాలు 7లో..



కల్యాణం అనంతరం కర్పూర దండలతో సత్యదేవుడు, అనంతలక్ష్మి దంపతులు



పట్టువస్త్రాలతో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ నివాస్, ఈవో రామచంద్రమోహన్, ఆలయ చైర్మన్ ఐవీ రోహిత్ తదితరులు



కల్యాణ వేళ కాంతులీనుతున్న రత్నగిరి (విహంగ వీక్షణం)

రైతుల స్వార్థంతో... లాకులు మూసివేత



గుర్రపుడెక్క, తూడుతో నిండిపోయిన అప్పర్ కౌశిక మేజర్ డ్రెయిన్

- రెండు వేల మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి గండి
- మొరపెట్టుకున్నా పట్టించుకునేవారే లేరు

అమలాపురం రూరల్, మే 19: వరద నీరు గ్రామాలపై పోటెత్తకుండా లాకులను మూసివేశారు. కానీ కొందరు రైతుల స్వార్థం కోసం లాకులను మూసి వేయడంతో రెండు వేల మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి గండి పడింది. లాకులు తెరిచి ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాలని సొసైటీల ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎన్నికల హడావుడిలో అధికారులెవరూ పట్టించుకోవట్లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమలాపురం మండలం నుంచి అంబాజీపేట, పి.గన్నవరం మండలాల మీదుగా ముంజవరం లాకుల వరకు అప్పర్ కౌశిక మేజర్ డ్రెయిన్ ఉంది. ఈ డ్రెయిన్‌పై ముంగండ, పోతవరం, ఉడిమూడి, కె.ముంజవరం, వాకలగరువు, మాచవరం, మొసలపల్లి, భట్లపాలెం, బండారులంక, అగ్నికుల క్షత్రియ మత్స్యకార సొసైటీల ప్రతినిధుల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. సుమారు రెండు వేల కుటుంబాలకు జీవనోపాధిగా నిలిచే అప్పర్ కౌశిక మేజర్ డ్రెయిన్ లాకులను ముంజవరం వద్ద మూసివేయడంతో మత్స్య కారుల జీవనోపాధికి గండి పడింది. సముద్ర ఆటు పోట్లతో మేజర్ డ్రెయిన్‌లోకి వచ్చివెళ్లే నీటితో ఎంతో పరిశుభ్రంగా ఉండే అప్పర్ కౌశిక డ్రెయిన్ లాకుల మూసివేతతో మురుగునీరు కిందకు దిగే మార్గం లేక నీరు నిలిచిపోయి దుర్వాసన కొడుతోంది. దోమల బెడద పెరిగిపోయింది. ఇక డ్రెయిన్ పొడవునా గుర్రపుడెక్క, తూడు విపరీతంగా పెరిగిపోయి అక్కడ డ్రెయిన్ ఉదా అనే పరిస్థితిని కల్పించారు. ఏప్రిల్, మే నెలల్లో గోదావరి నీరు మేజర్ డ్రెయిన్‌లోకి రావడం వల్ల మత్స్య సంపద ఉత్పత్తి విపరీతంగా పెరుగుతోంది. లాకులమూసివేతతో డ్రెయిన్లలో చేపల వేట చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందని మత్స్యకార సంఘాల నాయకులు లంకాడి ప్రసాద్, కామాడి సత్యరాజ నాయకర్, నేదునూరి సత్యనారాయణ, కోట శ్రీరాములు, పి.రాధాకృష్ణ, మల్లాడి ధర్మరాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మేజర్ డ్రెయిన్ శుభ్రంగా ఉండాలంటే...

మేజర్ డ్రెయిన్‌లో చెత్తాచెదారంతో పాటు గుర్రపుడెక్క తొలగించడానికి ఏటా ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చిస్తోంది. అయితే డ్రెయిన్‌కు ఆటు, పోటు నీరు రావడం వల్ల చెత్తాచెదారం తొలగిపోవడంతో పాటు గుర్రపుడెక్క పెరగదని మత్స్యకార నాయకుడు దుర్గారావు తెలిపారు. డ్రెయిన్‌కూడా శుభ్రంగా ఉండడం వల్ల ప్రజారోగ్యానికి రక్షణగా ఉంటుందన్నారు.



లాకులు తెరిచి న్యాయం చేయాలి

ధర్మాడి ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షుడు, ఇందుపల్లి

ముంజవరం లాకులను తక్షణం తెరిపించి మత్స్యకార కుటుంబాలకు న్యాయం చేయాలి. భవిష్యత్తులో గోదావరి వరదల సమయంలో మినహా మరెప్పుడూ లాకులు మూసివేయకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. లాకులను మూసివేయడం వల్ల మత్స్య సంపద లేక ఉపాధి కోల్పోయాము.



వడ్డిగూడెంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న వృద్ధుడు (పాత చిత్రం)

పెరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

జూన్ 4న జరిగే లెక్కింపు మరింత జాప్యం జరిగే అవకాశం

అమలాపురం టౌన్, మే 19: సార్వత్రిక ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పెరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకున్న పలు కీలక నిర్ణయాలతో జిల్లాలో ఓటింగ్ శాతం మెరుగైంది. ప్రధానంగా 85ఏళ్లు పైబడిన వృద్ధులు, మంచాలకే పరిమితమైన దివ్యాంగులకు సైతం తొలిసారి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. ఇప్పటి వరకు ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉండేది. పెరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ మరింత జాప్యం అయ్యే అవకాశం ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 15,201 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు.

అమలాపురంలో అత్యధికంగా 2,513 పోస్టల్ బ్యాలెట్లు

జిల్లాలో 15,201 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. అత్యధికంగా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 2513 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. రామచంద్రపురంలో 2201 మంది, ముమ్మిడివరంలో 2026 మంది, రాజోలులో 2358 మంది, పి.గన్నవరంలో 2182 మంది, కొత్తపేటలో 2117 మంది, మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 1804 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌తోనే ఓట్ల లెక్కింపు ప్రారంభం...

జిల్లాకు సంబంధించి చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్‌లను ముందస్తుగానే సిద్ధం చేస్తారు. అయితే నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్లను పూర్తిస్థాయిలో కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు పరిశీలిస్తారు. పోస్టల్ బ్యాలెట్ వేసిన వారు సంతకం (లేదా) వేలిముద్ర వేశారా లేదా పరిశీలిస్తారు. గతంలో రెండు గంటల వ్యవధిలోనే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేది. పెరిగిన ఓట్లతో ఉదయం 11 గంటల సమయానికి గాని లెక్కింపు పూర్తయ్యే పరిస్థితులు లేవు. పోస్టల్ బ్యాలెట్లను ఓ ప్రధాన రాజకీయ పార్టీ పెద్దగా పట్టించుకోమని చెప్తుంటే మరో పార్టీ తమ విజయం పోస్టల్ బ్యాలెట్ నుంచేప్రారంభమవుతుందని చెప్తున్నారు.

ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు...

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. నియోజకవర్గంలోని పోలింగ్ శాతాన్ని బట్టి రౌండ్లు కేటాయిస్తారు. సాధారణంగా నియోజకవర్గ ఓట్ల లెక్కింపును 14 రౌండ్లుగా విభజించి లెక్కిస్తారు. ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదటి దశలో కొంత జాప్యం జరుగుతుంది. ఒక్కో రౌండ్‌కు అర గంట సమయం పట్టే అవకాశం ఉందని గతంలో లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఉద్యోగులు చెప్తున్నారు. నాలుగైదు రౌండ్లు పూర్తయ్యేసరికి వేగం పెరిగి ప్రతి 20 నిమిషాలకు ఒక రౌండ్ లెక్కింపు పూర్తవుతుంది. ఏది ఏమైనా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆ రోజు సాయంత్రం 6 గంటల సమయానికి ముగిసే అవకాశం ఉంటుంది. టేబుళ్ల వారీగా అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరుగుతున్నప్పటికీ దానికి అనుసంధానంగా లోక్‌సభ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు జరుగుతుంది.



నార్కెడిమిల్లిలో ర్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా బృందం

ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- నార్కెడిమిల్లి ర్యాంపు పరిశీలన

ఆత్రేయపురం, మే19: సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఇసుక అక్రమ తవ్వకాలపై దృష్టి సారించారు. ఆదివారం ఆయన జిల్లా అధికారులతో కలిసి ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లి ర్యాంపును పరిశీలించారు. తూర్పు గోదావరి జిల్లా తీపర్రు, ఉసులుమర్రు రీచ్‌ల నుంచి జియో ట్యాగింగ్ పరిధి దాటి తవ్వకాలు సాగిస్తున్నారనే ఆరోపణలపై ఈ తనిఖీలు చేపట్టారు. కోనసీమలోని కట్టుంగ, నార్కెడిమిల్లి పరిధిలోకి వచ్చి తవ్వకాలు సాగిస్తున్నారా లేదా అని చూశారు. పరిధి దాటి ఇసుక అక్రమ తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపట్టాలని వివిధ శాఖాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాత్రివేళల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తూ పర్యావరణానికి తూట్లు పొడిస్తే తీవ్రంగా స్పందిస్తామన్నారు. త్వరలో జిల్లాలో పోలీసులు, వివిధ శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీ ర్యాంపుల్లో పర్యటించి అక్రమ తవ్వకాలను నిరోధిస్తుందన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దారు వెంకట్రామయ్య, జలవనరులు, మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖల అధికారులు వున్నారు.

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	35	28

బ్యాడ్మింటన్ స్టార్ సాత్విక్‌సాయిరాజ్‌కు **అభినందనలు**
-7లో

సరదా... కారాదు విషాదం

కాటన్ బ్యారేజీ వద్దకు ఆహ్లాదంగా గడిపేందుకు వచ్చి మృత్యువాత పడుతున్న యువకులు

ఆత్రేయపురం, మే 19: ఉభయ గోదావరి జిల్లాలకు వారధి... ప్రకృతి అందాలకు నెలవు. అఖండ గోదావరి వశిష్ఠ, గౌతమి నదులుగా విడుతున్న ఈ ప్రాంగణం ప్రకృతి సోయగాలతో పర్యాటకులను ఆకర్షిస్తోంది. వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడకు వచ్చి అందాలను ఆస్వాదిస్తూ ఆహ్లాదంగా గడుపుతున్నారు. అయితే యువత హద్దులు దాటి గోదావరి ఒడిలో ఆటలాడుతుండడంతో విషాదఛాయలు తప్పడం లేదు. ప్రతి వేసవిలోనూ ఉపశమనం పొందేందుకు ఉభయ గోదావరి జిల్లాల వాసులు కాటన్ బ్యారేజీ వద్దకు వస్తుంటారు. ఇక్కడి ఆనకట్ట వద్ద స్నానం చేస్తూ సందడి చేస్తున్నారు. వందల సంఖ్యలో పర్యాటకులు మోటారు సైకిళ్లపై హడావుడి చేస్తున్నారు. ఆటపాటలతో యువకులు ఒకరికొకరు పోటీపడి బ్యారేజీ గేట్ల వద్దకు వెళ్లడంతో లోతు తెలియక నీట మునిగి మృత్యువాతపడుతున్నారు. ప్రతిఏటా పదుల సంఖ్యలో యువకులు చనిపోతూ తల్లిదండ్రులకు గర్భశోకం మిగులుస్తున్నారు.

వేసవి సెలవులకు తోడు ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో పచ్చని వాతావరణంలో హాయిగొల్పే పిచ్చుకలంక, రేగులలంకల్లో గోదావరి అందాలను ఆస్వాదిస్తూ సాయంసంధ్యా సమయంలో బ్యారేజీ వద్ద ఇసుక తిన్నెల్లో స్నేహితులతో సరదగా గడిపి సహపంక్తి భోజనాలు చేస్తున్నారు. అనంతరం స్నానాలు చేస్తున్నారు. పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించలేక గోదావరి గేట్ల వద్దకు వెళ్లి గల్లంతై మృత్యువాతపడుతున్నారు. హెడ్ వర్క్స్, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టకపోవడంతో చనిపోతున్న వారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది. మే నెలలో సరదా కాస్తా విషాదాన్ని మిగులుస్తోంది. చనిపోతున్న వారిలో 20ఏళ్ల వయసులోపు వారే అధికంగా ఉంటున్నారు.

మరోపక్క వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు బడుగువానిలంక నుంచి గోదావరిలో కాలినడకన వస్తున్నారు. వశిష్ఠ గోదావరి వైపు తూర్పు గోదావరి జిల్లా నుంచి తీపర్రు మీదుగా గోదావరి మార్గంలో మీదుగా వాడపల్లి చేరుకుంటున్నారు. అప్పడప్పుడు కురుస్తున్న వర్షాలకు ఏర్పడే ఊబిల్లోకి దిగబడి కన్నుమూస్తున్నారు.

మే నెలలో ప్రమాదవశాత్తు గోదావరిలో పడి సుమారు పది మంది దాకా చనిపోయారు. కాటన్ బ్యారేజీ వద్ద స్నానం చేస్తూ ఆరేపల్లి శ్రీరామ్ (20), గోపాలపురం మండలానికి చెందిన పి.వీర వెంకట సతీష్‌కుమార్ (18), రాజమహేంద్రవరం రూరల్ నామవరానికి చెందిన ఓ యువకుడు, రాజమహేంద్రవరానికి చెందిన దినేష్ మృతి చెందారు. వాడపల్లికి గోదావరి మార్గం ద్వారా వస్తున్న మడికికి చెందిన పి.అనంతలక్ష్మి, కొప్పిరెడ్డి ఏసమ్మ, కర్రి సునీత ఊబిలో కూరుకుపోయి మృతి చెందారు. రావులపాలెం బ్యారేజీ చెంతన స్నానం చేస్తూ సబ్బెళ్ల ఈశ్వరరెడ్డి, సత్తి సంపత్‌రెడ్డి, పెంటా జయకుమార్ గల్లంతై మృతి చెందారు.

కాగా బ్యారేజీని పర్యవేక్షించే హెడ్‌వర్క్స్ అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతోంది. ఆనకట్టు ఎగువ, దిగువన బారికేడ్లు ఏర్పాటుచేసి ఎవరూ లోపలికి దిగకుండా ఆంక్షలు పెడుతూ లస్కర్ వ్యవస్థను పటిష్ఠం చేయాలి. ఇందుకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాలి. ప్రతి రోజూ సాయంత్రం వేళ ఒకరిద్దరు పోలీసులు అక్కడికి వెళ్లి గుంపులను చెదరగొడుతున్నారు. అయినా ఎవరూ లెక్క చేయడం లేదు. పోలీసులు వెళ్లిన తర్వాత షరా మామూలే. వివిధ శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి యువకుల ప్రాణాలను కాపాడాలని తల్లిదండ్రులు, ప్రజలు ముక్తకంఠంతో కాపాడుతున్నారు.



బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద స్నానాలు చేస్తున్న పర్యాటకులు



బైక్‌తో హడావుడి చేస్తున్న యువకుడిని హెచ్చరిస్తున్న పోలీసు



కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న పండితులు



తలంబ్రాల వేడుక

స్వామి, అమ్మవారి దివ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన భక్తజనం





కల్యాణ వైభోగమే..

కనుల పండువగా సత్యదేవుని దివ్య కల్యాణం

- కమనీయంగా వేడుక
- శోభాయమానంగా మారిన రత్నగిరి
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

భువనమోహన రూపుడైన సత్యదేవుడి కల్యాణం ఆదివారం రాత్రి రత్నగిరిపై అంగరంగ వైభవంగా జరిగింది. ఆద్యంత రహితుడైన స్వామి, అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడిన వేళ ప్రకృతి పరవశించగా రత్నగిరి పులకరించింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సుగంధభరిత పుష్ప పరిమళాలతో స్వామి సన్నిధి అణువణువునా శోభిల్లింది.



అన్నవరం, మే 19: కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం అంకురార్పణతో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం నాందీదేవత పఠన నిర్వహించిన అర్చకులు ధ్వజారోహణం చేసి గరుడ ద్విభాగం ఎగురవేసి స్వామికల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. చైర్మన్ ఐ.వి రోహిత్ దంపతులు పండితులకు దీక్షా వస్త్రాలను అందజేశారు. రాత్రి 7 గంటలకు బాజాభజంత్రీలు, వేదమంత్రాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ సత్యదేవుడిని వెండిగరుడ వాహనంపైన అనంతలక్ష్మి అమ్మవారిని వెండి గజవాహనంపై గ్రామోత్సవం జరుపుకుని కల్యాణవేదిక వద్దకు చేరుకున్నారు. సర్వశిల్పకళా శోభితమైన, వివిధ పరిమళ పుష్పాలతో విద్యుద్దీప అలంకరణతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వార్షిక కల్యాణవేదికపై స్వామి, అమ్మవార్లను అధిష్ఠింపజేసి అర్చకస్వాములు కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. ఈ వివాహ కార్యక్రమానికి సీతారాములు పెండ్లి పెద్దలుగా వ్యవహరించడంతో మరో వేదికపై వారిని ఆసీనులు గావించి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం కన్యావరుణలు జరిపి అమ్మవారితో మంగళగౌరీపూజను జరిపించారు. స్వామి, అమ్మవార్ల వంశవృక్షాన్ని వివరించే ప్రవరను వేదపండితులు పఠించారు. ద్విజత్వాన్ని ప్రసాదించే సువర్ణ యజ్ఞోపవీతాన్ని మంత్రపూర్వకంగా స్వామికి అలంకరించారు. శ్రీచరణుని పాదాలను పవిత్రజలంతో కడిగి పాద ప్రక్షాళన కార్యక్రమం మధుపర్క ప్రాశన జరిపి మధుపర్కాలను స్వామికి ధరింపచేశారు. చతుర్వేద పండితులు దేశకాలమాన పరిస్థితులు వివరించే మహాసంకల్పం చెప్పి చూర్ణికమంత్రాలు పఠించారు. సుముహూర్త వేళ భక్తరక్షణలో ఒకరికొకరు బాసటగా ఉండాలంటూ జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని స్వామి, అమ్మవార్లు ఒకరి శిరస్సుపై మరొకరు ఉంచారు. అమ్మవారికి దివ్యతేజస్సు ప్రసాదించే యుగచ్ఛిద్రాభిషేకం నిర్వహించగా భక్తజన గోవింద నామ స్మరణ మధ్య మాంగల్యం తంతునా నేనా లోకరక్షణ హేతునా అంటూ స్వామి, అమ్మవారి మెడలో మూడుముళ్లు వేశారు. స్వామి, అమ్మవార్లు ఒకరి శిరస్సుపై మరొకరు మంచిముత్యాల తలంబ్రాలు వేసుకుంటూ భక్తులకు వేడుక కలిగించారు. పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలతో నుదుట తిలకం, బుగ్గన చుక్కతో స్వామి, అమ్మవార్ల దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు.

కల్యాణ తంతును వీక్షిస్తున్న అధికారులు



ఈ కల్యాణ తంతును ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించగా వేడుకలో ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ ఐ.వి రోహిత్ పాల్గొన్నారు. ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పట్టువస్త్రాలను సమర్పించారు. వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు తదితరులు నిర్వహించారు. కల్యాణం అనంతరం 8 ప్రత్యేక కౌంటర్ల ద్వారా తలంబ్రాల అక్షింతల ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 150 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కలెక్టర్ నివాస్ కల్యాణ వేడుకలకు హాజరయ్యారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో 150 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



సాంస్కృతిక కార్యక్రమాలు





పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న చైర్మన్, ఈవో



సాత్విక్‌సాయిరాజ్‌కు అభినందనలు

అమలాపురం టౌన్, మే 19: థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 డబుల్స్ ఫైనల్స్‌లో రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జోడీ విజయం సాధించింది. దీంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ జోడీకి పలువురు అభినందనలు తెలిపారు. సాత్విక్‌సాయిరాజ్ విజయ యాత్రలో మరో కప్ వచ్చి చేరిందని అభినందించారు. సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జంటకు ఒలింపిక్ అసోసియేషన్ చీఫ్ అడ్వయిజర్ కుడుపూడి సూర్యనారాయణరావు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ మెట్ల వెంకటసూర్యనారాయణ, అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెట్ల రమణబాబు, కార్యదర్శి గోకరకొండ నాగేంద్ర, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

సర్టిఫికెట్లు ఎప్పుడిస్తారో..?

- కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలకు పాట్లు
- నూతన విద్యాసంవత్సరం ఆరంభంలో ఇబ్బందులు
- ఎన్నికల విధులతో ఆగిన సర్టిఫికెట్ల జారీ
- పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, మే 19 : ఉన్నత విద్యకు అర్హత సాధించిన విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీలో చాలా జాప్యం జరుగుతోంది. ఎన్నికల కోడ్ అమలు ప్రారంభం నుంచి రెవెన్యూ శాఖ నుంచి జారీ కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు రాక విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో దాదాపు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారు. దీంతో విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలు జారీలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు వేచి చూస్తున్నారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయినా వెబ్‌సైట్‌లు ఓపెన్ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ధ్రువీకరణ పత్రాల అవసరం పెరిగింది. నూటికి 90 శాతం విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లోనే చదువుకునేందుకు ఉత్సాహం చూపు తున్నారు. ఆయా విద్యాసంస్థల్లో 80 శాతం పైబడి అడ్మిషన్లు అయిపోయాయి. ఆయా కాలేజీల్లో చేరేందుకు కుల, ఆదాయ , నివాస ధ్రువీకరణ పత్రాల అవసరం ఉంటుంది. దీంతో ఇప్పటికే విద్యార్థులు మీసేవ, సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. అయితే అధికారులు అందరు ఎన్నికల విధుల్లో ఉండడం వల్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయి ఐదు రోజులు కావడంతో దరఖాస్తులు చేసుకున్నవారు కార్యాలయాలకు వెళుతుంటే ఇంకా పూర్తి కాలేదనే సమాధానం వస్తోంది. జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు 16 రోజుల గడువు ఉన్నప్పటికి సర్టిఫికెట్స్ జారీలో జాప్యం తప్పడం లేదు. ఒక పక్క రోజులు గడుస్తున్నాయి.. కాలేజీల అడ్మిషన్లు వేగంగా అయిపోతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి , కలెక్టర్ డాక్టర్ మాధవీలత వెంటనే స్పందించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

కొవ్వూరు, మే 19: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా ఇద్దరు గాయపడినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరులోని ఇందిరమ్మకాలనీకి చెందిన కల్లి పూర్ణ సాయికార్తీక్ (21) తన స్నేహితులు కరగాని గణేష్, కురందాసు దుర్గలతో కలిసి బైక్‌పై కొవ్వూరు నుంచి దొమ్మేరు వైపు వెళ్తుండగా నందమూరు జగనన్న కాలనీ, కాపవరం గ్రామాల మధ్యలో ఎక్స్‌ప్రెస్ హైవే సర్వీస్ రోడ్‌లో అరటికాయల లోడ్‌తో వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికార్తీక్ అక్కడికక్కడే మృతి చెందగా గణేష్, దుర్గలకు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కారు అద్దాలు పగలకొట్టి బంగారం చోరీ



కొత్తపల్లి, మే 19: సాయంత్రం పూట చల్లగాలులను ఆశ్వాదించేందుకు ఉప్పాడ బీచ్‌కు వచ్చిన పర్యాటకుల బంగారు అభరణాలు, నగదును దొంగిలించిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 12వ తేదీ సాయంత్రం కాకినాడ రూరల్ మండలం వలసపాకలకు చెందిన కె.శంకర్ తన కారులో కుటుంబసభ్యులతో ఉప్పాడ బీచ్‌కు వచ్చారు. సముద్రంలో స్నానాలు చేసేందుకు కుటుంబసభ్యుల బంగారు ఆభరణాలు బ్యాగ్‌లో పెట్టి కార్‌ను ఒక పక్కగా పార్క్ చేశారు. స్నానాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యేందుకు కార్ దగ్గరకు రాగానే అప్పటికే కార్ వెనుక డోర్ అద్దం పగిలి ఉండడాన్ని గమనించిన శంకర్ లోపల బంగారు ఆభరణాలు జాగ్రత్త చేసిన బ్యాగ్ కనిపించకపోవడం, దానిలో ఉన్న సుమారు రూ 2.50లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ 3 వేల నగదు, సెల్‌ఫోన్‌లు, క్రెడిట్‌కార్డులు లేకపోవడాన్ని గుర్తించారు. వెంటనే అక్కడ చుట్టుపక్కల వారిని ఆరా తీయగా ఎవరికీ తెలియదని చెప్పడంతో శంకర్ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు బీచ్‌రోడ్డులో విచారణ చేపట్టారు.

వైభవంగా భావనారాయణస్వామి కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

సర్పవరం జంక్షన్, మే 19 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి కల్యాణం వందలాది మంది భక్తుల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి వార్షిక దివ్య కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి వైశాఖమాసం శుద్ధ ఏకాదశి విశేష పర్వదినంలో భావనారాయణస్వామి కల్యాణాన్ని పూర్తి సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్ఛరణలతో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నిత్య పూజ హోమం, బలిహరణ సేవాకాల కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పెద శేష వాహనంపై తిరువీధి ఉత్సవం ఘనంగా జరిపారు. దివ్య కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ ఆవరణలో ఎదురు సన్నాహ కార్యక్రమం పూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి కల్యాణం వైభవంగా జరిపారు. తలంబ్రాలు పోసుకునే దృశ్యాన్ని ఆద్యంతం భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కల్యాణాన్ని స్వయంగా వీక్షించేందుకు ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జె. భీమశంకరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గోదావరిలో మునిగి బాలుడి మృతి



ఆత్రేయపురం, మే 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ దిగువన గోదావరిలో స్నానం చేస్తూ బాలుడు మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శాంతినగర్‌కు చెందిన దడాల దినేష్ (15) ఆదివారం తన మిత్రులతో కలిసి బ్యారేజీ వద్దకు స్నానానికి వెళ్లాడు. సాయంత్రం సమయంలో బ్యారేజీ దిగువకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్రేయపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ప్రత్తిపాడు, మే 19: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. స్థానిక నరేంద్రగిరి కొండ జంక్షన్ వద్ద రహదారిపై వెళుతున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. టీషర్ట్, జీన్ ఫ్యాంట్ శరీరంపై ఉంది. యువకుడు తెలుపు రంగుతో ఐదున్నర అడుగుల పొడవు ఉన్నాడని ఆచూకీ తెలిసిన వారు ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతదేహం కలకలం



తుని రూరల్, మే 19: 16వ నెంబరు జాతీయ రహదారి ఆనుకుని తేటగుంట శివారు రాజుల కొత్తూరు వద్ద ఆదివారం వివస్త్రగా ఉన్న ఓ మహిళ మృతదేహం కనిపించడం తీవ్ర సంచలనం సృష్టించింది. స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు మహిళను చిత్రహింసకు గురిచేసి అత్యాచారం చేసి చంపి ఈ ప్రాంతంలో పడేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. సంఘటనా స్థలంలోని సమీప పరిసరాలు, హోటల్స్‌లో ఆరా తీస్తున్నారు. ఆర్. కొత్తూరు శివారు ఎర్రకోనేరు వద్ద మహిళ మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన బెడ్‌షీట్‌ను పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన మహిళ తుని ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో వ్యభిచారం చేస్తూ జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. తుని పట్టణంలో దిబ్బలపాలెంలో రాపర్తి అమ్ములు అనే అమెతో కలిసి ఉంటుందని ఆ ప్రాంతంలో ఆమెను కుమారిగా పిలుస్తారని తెలిసిందన్నారు. ఈ దారుణానికి పాల్పడిన కారకులను త్వరలోనే పట్టుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం



రావులపాలెం, మే 19: రావులపాలెం గౌతమి గోదావరిలో శనివారం సరదాగా ఈత కోసం దిగి గల్లంతైన ముగ్గురిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమైన విష యం విదితమే. మూడో యువకుడైన సత్తి సంపతరెడ్డి (17) కోసం గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం తాతపూడి ఇసుక ర్యాంపు సమీపంలో మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సీఐ ఎం.ఆంజనేయులు తెలిపారు.


పార్టీకి నష్టం చేస్తే క్షమించేదిలేదు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

ప్రత్తిపాడు, మే19: టీడీపీలో ఉంటూ పార్టీకే నష్టం వాటిల్లే విధంగా వ్యవహరించే వారు ఎంతటి వారైనా పార్టీ ఉపేక్షించదని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. ప్రత్తిపాడు మండలం టీడీపీ నాయకులు ఆదివారం తేటగుంట తరలివెళ్లి మాజీ మంత్రి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును కలిశారు. టీడీపీలో ఉంటూ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం పనిచేసిన మురళీరాజును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, పార్టీ సభ్యత్వం రద్దు చేయించాలని టీడీపీ నాయకులు కోరారు. దీనికి మాజీ మంత్రి యనమల స్పందిస్తూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎవరైనా పార్టీ చర్యలు తీసుకోవడం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, మండల పార్టీ నాయకులు అమరాది వెంకట్రావు, పల్లా గోపి, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, గొంతిన సురేష్, జింకల తాతారావు, మంతెన శ్రీను, లొండా లోవరాజు, రోమాల అప్పలరాజు, సింగిలి వెంకటేష్, తటవర్తి సుబ్బారావు, ఇళ్ళ అప్పారావు, పోలిశెట్టి శ్రీను, రావూరి తాతాజీ, చిలకమర్తి వీరభద్రం, పుణ్యమంతుల శ్రీను పాల్గొన్నారు.

తలుపులమ్మ లోవలో భక్తుల సందడి





తుని రూరల్, మే19: తూర్పు కనుమల్లో కొలువై భక్తుల ఆరాధ్య దైవంగా పూజలు అందుకుంటున్న తలుపులమ్మ వారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తల్లి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేకువజామునే వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. లోవకు కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లోను, ఆరుబయట వంటా వార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. తరలివచ్చిన వాహనాలతో లోవ ప్రాంగణంలో వాహనాల రద్దీ ఏర్పడింది. రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.3.69 లక్షలు ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

ఏపీఈఏపీ సెట్‌కు 897 మంది హాజరు

జేఎన్టీయూకే, మే19: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 927 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 897 మంది హాజరయ్యారని, 30 మంది గైర్హాజరు కాగా 96.76 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదే విధంగా తూర్పుగోదావరి జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షకు 715 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 704 మంది హాజరయ్యారని, 11 మంది పరీక్ష రాయలేదని మొత్తం 98.46 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 345 మంది హాజరు కావాల్సి ఉండగా 336 మంది హాజరయ్యారని 9 మంది గైర్హాజరయ్యారని మొత్తం 97.39 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు ఆదివారం మధ్యాహ్నం సెషన్‌లో మాత్రమే జరిగాయని ఈ పరీక్షలు ఈ నెల 23 వరకూ కొనసాగుతాయన్నారు.

బాలపురస్కార్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం, మే 19: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డు-2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పుదుచ్చేరి ఉమెన్ అండ్ చైల్డ్ డెవలెప్‌మెంట్ డైరెక్టర్ పి.ముత్తుమీనా తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా జూలై 31లోగా అభ్యర్థులు దరఖాస్తులు పంపాలన్నారు. క్రీడలు, సామాజిక, సేవ, సైన్సు అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్ అండ్ కల్చర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకాల్ బాలలు అవార్డుకు అర్హులన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగేస్తే చర్యలు


రౌడిషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా

మండపేట, మే 19: జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపునకు విఘాతం కలిగించినా, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం షేర్ చేసినా కఠిన చర్యలు తప్పవని అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా చెప్పారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి మండపేటలో పర్యటించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో స్థానిక కలవపువ్వుసెంటరు, మారేడుబాక, రాజారత్నంసెంటరులో ఏర్పాటు చేసిన క్విక్‌రెస్పాన్స్ టీమ్‌లను కలిసి పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అల్లర్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఉన్న 89మంది రౌడిషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల ఫలితాలు అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రామచంద్రపుర డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్, అర్బన్ సీఐలు శ్రీధర్‌కుమార్, అఖిల్‌జమా, పట్టణ, రూరల్ ఎస్‌ఐలు హరికోటిశాస్త్రి, నాంచారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థికి సత్కారం



ముమ్మిడివరం, మే 19: ఎన్డీయే కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజును ఆదివారం సీహెచ్ గున్నేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. ఆయా గ్రామాల్లో పోలైన ఓట్ల శాతం, కూటమికి ఎన్ని ఓట్లు లభించాయి. ప్రత్యర్థి పార్టీకి ఎన్ని ఓట్లు లభించాయని చర్చించి తమ అభ్యర్థి అత్యధిక ఓట్లతో విజయం సాధిస్తారని ఆశాభావంతో నివేదికనిచ్చారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, యాళ్ల ఉదయ్, గాలిదేవర బుల్లి, గొలకోటి వెంకటరెడ్డి, గోలకోటి చిట్టిబాబు, గాలిదేవర గంగాధర్, నలాది కిశోర్, గొలకోటి తాతాజీ, సకిలే వెంకట్, సబ్బతి రాంబాబు, అత్తిలి చిన్నా, సుంకర శ్రీను, గుమ్మళ్ల రాము, యాళ్ల చంటి, కురసాల శివబాబు, గుబ్బల తాతబ్బాయి, వాసంశెట్టి పట్టాభిరామయ్య, పెయ్యాల వెంకటరమణ, పలివెల రాధాకృష్ణ, యర్రంశెట్టి అబ్బు, మట్టపర్తి ఈశ్వరి, అడబాల నాని పాల్గొన్నారు.

- అంకురార్పణ, ధ్వజారోహణంతో కల్యాణోత్సవాలకు శ్రీకారం
- కల్యాణం తిలకించిన భక్తులు
- స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం




ముమ్మిడివరం: కొత్తలంక సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు, ద్రాక్షారామ: సత్యనారాయణస్వామివారి కల్యాణమహోత్సవం, కొత్తపేట: వాడపాలెంలో సత్యనారాయణస్వామి కల్యాణం

ముమ్మిడివరం, మే 19: కొత్తలంక గ్రామంలోని శ్రీఅనంత లక్ష్మీ సత్యవతి సమేత వివేక సత్యనారాయణస్వామివారి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. ఐదు రోజులు నిర్వహించి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రత్యేక వ్రతాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు రాత్రి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీకంఠం ప్రభాకరశర్మ, రేమెళ్ల సూర్యనారాయణమూర్తి వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. నడిమింటి సూర్యప్రభాకరం, వీపూరి వెంకటసత్యనారాయణరాజు కోర్ల సుబ్బారావు, నడిమింటి సూర్యబాస్కరం, వంగా సత్యనారాయణమూర్తి, రెడ్డి ధనసత్యనారాయణ పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ర్యాలి గ్రామంలో రమాసత్యనారాయణస్వామి వారి దివ్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం ఆగమ శాస్త్ర ప్రకారం వేదపండితులు అంకుర్పారణ, ధ్వజారోహణంతో కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. రాత్రి అశేష భక్తజనం కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉమాకమండలేశ్వరస్వామి కల్యాణం కూడా వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాలను తిలకించారు. ఈవో కృష్ణచైతన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం సత్యదేవుని కల్యాణం వైభవంగా జరిగింది. అరిగెల వెంకటనరసింహారావు (నరేష్)-శిరీష దంపతుల నిర్వహణలో భైరవబొట్ల వెంకటసుబ్రహ్మణ్యం (నాని) బ్రహ్మత్వంలో కల్యాణ క్రతువు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు సత్యదేవుని దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు.

కొత్తపేట: వాడపాలెం సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని రమా సత్యనారాయణస్వామి దివ్య కల్యాణం పండితుడు పెద్దింటి రామం, అర్చకుడు దెందులూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీరమా సత్యవతి సమేత సత్యనారాయణస్వామివారి కల్యాణం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం, గ్రామోత్సవం జరిపారు. రాత్రి కల్యాణ వేదికపై అర్చకులు కంతేటి భీమశంకరం ఆధ్వర్యంలో కల్యాణం తంతు ప్రారంభించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, 7.10గంటలకు సుమూహూర్తం జరిపారు. మాంగళ్యధారణ అనంతరం తలంబ్రాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.టి.వి.సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కపిలేశ్వరపురం: వీధివారిలంకలో శ్రీసత్యనారాయణస్వామివారి కల్యాణం






అమలాపురం: బండారులంకలో త్రయంబకేశ్వరస్వామి కల్యాణం, ఐ.పోలవరం: శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణం, పి.గన్నవరం: రాజగోపాలస్వామి, అంతర్వేది: భూసమేత వేంకటేశ్వరస్వామివారు, రాయవరం: బాల త్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి

ముమ్మిడివరం, మే 19: ముమ్మిడివరం నగర పంచాయతీ పెద్ద వంతెన సమీపంలోని శ్రీగణేష్ కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామి-అమ్మవారికి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అంతర్వేది: అంతర్వేదిలోని శ్రీభూసమేతవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థాన విశ్రాంత ప్రధానార్చకులు వాడపల్లి బుచ్చిబాబు ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణ తంతు నిర్వహించారు. స్వామి-అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక సింహాసనంపై ఆశీను లుచేసి హోమం అనంతరం భక్తుల కోలాహలం నడుమ కల్యాణం నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించారు.

యానాం: యానాంశ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శాంతికల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి రఘురామవినోదాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గుబ్బల పరంజ్యోతి దంపతులు ఆలయంలో శాంతికల్యాణ మహోత్సవ పూజలు నిర్వహించారు. యానాం, పరిసర ప్రాంతాల భక్తులు కల్యాణం తిలకించి స్వామివారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవం అర్చకుడు కళ్లేపల్లి రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. అన్నాయిపేట సర్పంచ్ పెమ్మిరెడ్డి నాగేశ్వరావు భక్తులు పాల్గొన్నారు. సప్తగోదావరి ఒడ్డున వేంచేసియున్న సర్వమంగళ సమేత పాకశాసన స్వామివారికల్యాణోత్సవం జరిపారు.

కపిలేశ్వరపురం: కేరుమిల్లి ఏటిగట్టున కొలువైయున్న వెంకన్న ఆలయంలో ఆదివారం శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పురోహితుడు కామశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, విశేషపూజలు జరిపారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కేదార్లంక శివారు వీధివారిలంకలో శ్రీసత్యనారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు. గ్రామసర్పంచ్ వీధివెంకటరెడ్డి దంపతులతో పాటు పలువురు దంపతులతో పండితులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. ఆయా గ్రామస్తులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

త్రయంబకేశ్వరస్వామి దివ్య కల్యాణం

అమలాపురంరూరల్, మే 19: బండారులంకలోని శ్రీభువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో పంచరాత్ర దివ్య కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భువనేశ్వరి-త్రయంబకేశ్వరస్వామివార్ల కల్యాణాన్ని పురోహితుడు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయ్‌కిరణ్-సాయిరత్నప్రియ దంపతులు కర్తలుగా జరిపించారు. శ్రీశైలం నుంచి తీసుకువచ్చిన విభూది పరిమళాలు, రుమాళ్లు, లడ్డూ ప్రసాదం, మామిడిపండ్లను భక్తులకు పంపిణీ చేశారు. పిచ్చిక వెంకన్న, చింతా శంకరమూర్తి, పుత్సల వరదరాజులు, పడవల బాలాజీ, కాశిన బాబి, గుమ్మిడి రాజు, చింతా ఉమ, కాశిన బ్రాహ్మణుడు, జీవీ మాల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైశాఖ ఏకాదశి పూజలు

అయినవిల్లి, మే 19: నల్లచెరువులోని శ్రీపద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వస్వామి ఆలయంలో వైశాఖ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎ.వేమవరప్పాడు గ్రామానికి చెందిన బృందం చేసిన కోలాట ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

రాజగోపాలస్వామి కల్యాణోత్సవం

పి.గన్నవరం, మే19: లంకలగన్నవరం గ్రామంలో శ్రీరుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి వార్షిక, తిరు కల్యాణ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి కల్యాణం కనులపండువగా జరిగింది. ఈనెల 24వరకూ కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గన్నవరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీగరడేశ్వరస్వామి కల్యాణం అర్చకుడు భైరవభట్ల సత్యవెంకటనారాయణమూర్తి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా సాగింది. స్వామివారికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. 24వ తేదీ వరకు జరుగుతాయని ఈవో ప్రసాదరావు చెప్పారు.

వైభవంగా కైలేశ్వరస్వామి కల్యాణం

కొత్తపేట, మే 19: అవిడి గ్రామంలో శ్రీపార్వతీ కైలేశ్వరస్వామికల్యాణం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈనెల24వ తేదీ వరకు కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకుడు రామంపల్లి రాజారామ్ తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈవో చెప్పారు.

వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం

ద్రాక్షారామ, మే 19: నరసాపురపుపేటలో వేంచేసియున్న రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి దివ్యకల్యాణం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. సాయంత్రం 5గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. పెద్దింటి శేషాచార్యులు బ్రహ్మత్వంలో కల్యాణం తంతు ప్రారంభించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సుమూహూర్తం కార్యక్రమాలు వేద మంత్రాలు, మంగళవాయిద్యాలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం మాంగళ్యధారణ, తలంబ్రాలు, నీరాజనమంత్ర పుష్పాలతో కల్యాణం జరిగింది. అర్చకులు చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. ఈవో ఎం.వి.వి.సత్యనారాయణ కార్యక్రమాలనుపర్యవేక్షించారు.

శ్రీలక్ష్మీనరసింహుని దివ్య కల్యాణం

ఐ.పోలవరం, మే19: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో క్షేత్రపాలకుడు శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. జంపన రామకృష్ణంరాజు దంపతుల ఆధ్వర్యంలో కల్యాణ పూజలు నిర్వహించారు. ఈనెల19 నుంచి 24వరకు పాణంగిపల్లి సూర్యానారాయణాచార్యుల బ్రహ్మత్వంలో పాంచాహ్నిక దీక్ష జరుగుతుందని ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. అయిదు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వీరేశ్వరస్వామి ఆలయ అర్చకులు, పురోహితులు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సోమేశ్వరస్వామి కల్యాణం

రాయవరం, మే 19: సోమేశ్వరం శ్రీబాలాత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైశాఖమాసం ఏకాదశి పురస్కరించుకుని ఆలయ అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, పరిటాల సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు కల్యాణం తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కల్యాణోత్సవాలకు కలశస్థాపన

అమలాపురం రూరల్, మే 19: బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న శ్రీపద్మావతి అలివేలుమంగ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాల్లో బాగంగా ఆదివారం లక్కింశెట్టి ఫణిరాజు-హేమనాగలక్ష్మి దంపతులు కలశస్థాపన నిర్వహించారు. ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో కలశస్థాపన చేశారు. అనంతరం స్వామి-అమ్మవార్లను ప్రత్యేక వాహనంపై ఉంచి వాహన సేవ నిర్వహించారు. వల్లూరివారిపేట, తారకరామనగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన సేవలో శ్రీశ్రీనివాసా బాలమిత్ర సంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం పెదరాజు, బళ్ల సత్తిరాజు, బుట్టే శేఖర్, బళ్ల సుధీర్, అంకం ప్రశాంత్, లక్కింశెట్టి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి తీర్థం

అంబాజీపేట, మే 19: అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద తీర్థం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా శివకేశవుల కల్యాణం

అంబాజీపేట, మే 19: గంగలకుర్రు అగ్రహారం కౌశిక తీరాన వేంచేసియున్న శ్రీఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వార్ల కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పుల్లేల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి వెంకటనరసింహవర్మ, సుదర్శనం కేశవచార్యుల ఆధ్వర్యంలో స్వామి వార్ల కల్యాణం నిర్వహించారు. తొలుత స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.

ఆ నాయకులను కోర్టులో హాజరుపర్చాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 19: వరంగల్‌లో అరెస్టు చేసిన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నాయకులను తక్షణం కోర్టులో హాజరుపర్చాలని, గ్రామాల్లో కూంబింగ్ వెంటనే ఆపాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు బి.సిద్ధూ, వి.భీమశంకరం, సీహెచ్.రాజారెడ్డి డిమాండు చేశారు. శనివారం రాత్రి 11.30గంటలకు వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండలం అరేపల్లి గ్రామ సమీపంలో అబర్ల రాజన్న, సిద్దబోయిన జీవన్, దేవిరెడ్డితో పాటు మరొకరిని పోలీసులు మాటువేసి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. వారిని కోర్టులో హాజరుపర్చకుండా చిత్రహింసలకు గురిచేస్తూ గ్రామాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు అరెస్టుచేసిన నాయకులు 40ఏళ్ల నుంచి గిరిజన, గిరిజనేతర, ఆదివాసీ ప్రజలకు నాయకత్వం వహిస్తూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

మామిడికుదురు, మే 19: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాచపల్లి మంజునాథ్-పద్మావతి దంపతులు రూ.11,116, అదే రాష్ట్రానికి చెందిన పెనుకుదురు లక్ష్మణరావు-లక్ష్మీగీత దంపతులు రూ.10,001 విరాళంగా అందించారు. దాతలకు ఆలయ సహాయ కమిషనర్ జి.మాదవి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

బాల్య మిత్రునికి ఆర్థిక సాయం

మలికిపురం, మే 19: స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అంటూ 1988-89లో పదో తరగతి చదివిన బాల్య మిత్రులు తమతో చదువుకున్న స్నేహితుడి గృహ నిర్మాణానికి రూ.40వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆరేటి శ్రీనివాస్, నల్లి శివ, మేడిది కిరణ్‌కుమార్, పిల్లి ఆనందరావు, గుబ్బల శ్రీనివాస్, రహీమ్, లింగోలు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కేన్సర్ వ్యాధితో భర్తను కోల్పోయి నిలువ నీడలేని పరిస్థితుల్లో గృహ నిర్మాణం కోసం మాదాసు శేషారత్నం చేసుకున్న అభ్యర్థనకు అనేకమంది సహాయం అందించారు. ఆదివారం గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో తెన్నేటి ఫిలిప్, అడబాల హరికృష్ణ, బోనం రాజు పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.4.29లక్షలు

ఆత్రేయపురం, మే 19: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి మహారాష్ట్రకు చెందిన గునిశెట్టి శ్రీనివాస్ రూ.51,116 విరాళం సమర్పించారు. దాతకు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,29,837 లభించినట్టు ఈవో తెలిపారు.

ఆలయానికి రూ.10లక్షల విరాళం


విరాళంతో రంగులు వేసిన ఆలయం

మామిడికుదురు, మే 19: మొగలికుదురులో వేంచేసియున్న శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణరాష్ట్రాల సీఎంఆర్ చైర్మన్ మావూరి వెంకటరమణ-వెంకటపద్మావతి దంపతులు రూ.10లక్షలు విరాళం ఆలయ చైర్మన్‌కు అందించారు. రూ.5లక్షలతో ఆలయంలో యాగశాల కోసం నిర్మించారు. రూ.5లక్షలతో ఆలయానికి ప్రహరీకి రంగులు వేశారు. అలాగే ఈవిరాళంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా వివిధ రకాల హంగులతో తీర్చిదిద్దారు.

సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్లిన ఆదర్శమూర్తి సుందరయ్య

అమలాపురం టౌన్, మే 19: సైకిల్‌పై పార్లమెంటుకు వెళ్లిన ఆదర్శమూర్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆంధ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. పార్లమెంటు తొలి ప్రతిపక్ష నేతగా ఎందరికో ఆదర్శంగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నేత సుందరయ్య వర్ధంతి సభను ఆదివారం అమలాపురం ఎంప్లాయిస్ హోంలో సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. బీజేపీ మతోన్మాద విధానాలపై సుందయ్య చూపిన బాటలో పోరాడాలని పిలుపునిచ్చారు. సుందరయ్య చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుదే దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు, సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, తాడి శ్రీరామమూర్తి, కేవీ సత్యనారాయణ, తాళ్లూరి శ్రీనివాసరావు, విప్పర్తి మోహనరావు, కె.శంకర్, పర్వతాలు, జగడం నాగేశ్వరరావు, కె.సత్తిబాబు, సీహెచ్ సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం యూటీఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ఎంటీఎస్ సుబ్బారావు, జి.సురేంద్ర, బీఎన్ వెంకటేశ్వరరావు, పి.అమూల్య పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు


విరాళాల చెక్కులు అందజేస్తున్న రాయుడు బాబ్జి, భాస్కరచౌదరి తదితరులు

అమలాపురం టౌన్, మే 19: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని శేఖర్ థియేటర్ ప్రాంగణంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన ముందస్తు వేడుకలను ఆదివారం నిర్వహించారు. స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ రాయుడు బాబ్జీకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ప్రతినిధి భాస్కరచౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సింహాద్రి సినిమా స్పెషల్ షో ద్వారా వచ్చిన రూ.3లక్షల మొత్తాన్ని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల కుటుంబాలకు అందజేశారు. తొలుత థియేటర్ ప్రాంగణంలో కేక్ కట్ చేశారు. ఇటీవల మృతిచెందిన దొంగ ఈశ్వరరావు, అప్పారి శ్రీరామ్ కుటుంబాలకు రూ.50వేలు, రూ.40వేలు, ఖండవల్లి ప్రదీప్‌కుమార్ కుటుంబానికి రూ.40వేలు, రాపాక శివరామ్ కుటుంబానికి రూ.40వేలు, చింతా సత్యనారాయణ, ముమ్మిడివరపు పండు, గుబ్బల నారాయణ, వి.జగదీష్ ఆరోగ్యం నిమిత్తం రూ.80వేలు, గుత్తుల శ్రీలీల చదువుకు రూ.20వేలు చెక్కుల రూపంలో అందజేశారు. జిల్లా కార్యదర్శి కసిరెడ్డి శివనాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి కొపనాతి వెంకట్రాజు, ఎన్టీఆర్ అభిమాన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ బీచ్‌లో పర్యాటకుల సందడి

యానాం, మే 19: వేసవి నేపథ్యంలో రాజీవ్‌గాంధీబీచ్‌కు పర్యాటకుల తాడికి పెరిగింది. రాజీవ్‌బీచ్ ఆదివారం పర్యాటకులు, స్థానిక ప్రజలతో కిక్కిరిసింది. వాతావరణంలో మార్పులతో ఆకాశం మేఘావృతమై చూడచక్కటి దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. ఈఅందాలు పర్యాటకులను ఆకర్షించాయి.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: బాక్
శ్రీలలిత	: మిరల్
శేఖర్ స్క్రీన్-1	: కృష్ణమ్మ
శేఖర్ స్క్రీన్-2	: దర్శిని
రమా	: ఆ ఒక్కటి అడక్కు
గణపతి	: రత్నం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కింగడమ్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: నటరత్నాలు

పూర్వ విద్యార్థుల కలయిక



కాట్రేనికోన, మే 19: కాట్రేనికోన హైస్కూల్‌లో 1999-20 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం చదువుకున్న విద్యాలయంలో కలుసుకున్నారు. రెండు దశాబ్దాలుగా జీవితాల్లో సంభవించిన మార్పులు, సాధించిన విజయాలతో పాటు హైస్కూల్లో అల్లరి, గురువులతో అనుబంధం తదితర తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఆనందంగా, ఉత్సాహంగా గడిపారు. గురువులు ఎంఎస్ఎన్ మూర్తి, కె.ఆనందరావు, ఎస్.కృష్ణమూర్తి, సంజీవయ్య, లక్ష్మజీ, తాతారావు, నాగరాజు, కుమార్, శ్రీధర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోకా రమేష్, ఎం.మాధురి, వి.రమణ, మోకా సుషమశ్రీ, శైలజ, పందిరి భవాని, సత్యలక్ష్మి, నాగలక్ష్మి, లలిత, చిల్లా కుమార్, ఆకొండి సీతామహాలక్ష్మి, మోకా జాహ్నవి, బాలప్రసాద్, మోకా రత్నంరాజు, దొంగ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు పాము కాటు

ముమ్మిడివరం, మే 19: ముమ్మిడివరం నగర పంచాయతీ నక్కావారిపేటలో ఆదివారం ఒక మహిళ తాచుపాము కాటుకు గురై అస్వస్థతకు లోనైంది. నక్కావారిపేటకు చెందిన నక్కా లక్ష్మి(40)ని ఆదివారం మధ్యాహ్నం ఇంటి ఆవరణలో తాచుపాము కాటు వేసింది. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో కాకినాడ ప్రభుత్వాసుత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం, మే 19: మద్యంలో పురుగుల మందు కలిపి తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాణేలంక గ్రామానికి చెందిన కొంకి జ్యోతికృష్ణ(35) ఈనెల16న మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి అస్వస్థతకు గురయ్యారు. అతడిని స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అతడికి భార్య ఉమామహేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముమ్మిడివరం ఎస్‌హెచ్‌వో జి.భైరవస్వామి కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మలికిపురం, మే19: దిండి చెక్‌పోస్టు వద్ద ఆదివారంరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్ వెళ్లే ప్రైవేట్ ఆదివారంరాత్రి బస్సు పాలకొల్లు వైపు నుంచి మోటార్‌సైకిల్‌పై మలికిపురం వస్తున్న యువకులను ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఇద్దరు యువలకు తీవ్ర గాయాలయ్యాయి. వారి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వారిని అంబులెన్స్‌లో రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పళ్లాలమ్మకు అష్టోత్తర శత కలశ పూజ

మామిడికుదురు, మే 19: లూటుకుర్రు గ్రామదేవత శ్రీపళ్లాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి అష్టోత్తర శతకలశ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముత్తయిదువులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, ఫలపుష్పార్చనలు నిర్వహించారు. వివిధ రకాల వంటకాలు, మిఠాయిలతో అమ్మవారికి విశేష మహానివేదన సమర్పించారు. వేదపండితులు జగన్నాథశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అనంతరం జరిగిన భారీ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు టీబీ టీకా పంపిణీ

యానాం, మే 19: కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశాలతో పుదుచ్చేరిలోని అన్ని ప్రాథమిక, సామాజిక ఆరోగ్యకేంద్రాల్లో పెద్దలకు టీబీ టీకాలు వేయనున్నట్లు ఆరోగ్యశాఖ డైరెక్టర్ జి.శ్రీరాములు తెలిపారు. నెల రోజుల్లో 100శాతం లక్ష్యం పూర్తి చేస్తామన్నారు.

విద్యలో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు

మామిడికుదురు, మే 19: విద్యలో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పెదపట్నంలంక సర్పంచ్ సుందరనీడి చిన్న పేర్కొన్నారు. పెదపట్నంలంక గ్రామానికి చెందిన గిడుగు శ్రీరామదుర్గ పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 590 సాధించి మండలంలోని మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, ప్రధానోపాధ్యాయుడు కె.హరినాథ్, పీఎంసీ చైర్మన్ గిడుగు విజయనారాయణమూర్తి పాల్గొన్నారు.

దిండి రిసార్ట్స్‌కు మెరుగులు

మలికిపురం, మే 19: దిండి రిసార్ట్స్‌ను రూ.7కోట్లతో ఆధునికీకరిస్తున్నట్టు మేనేజర్ సీహెచ్ దుర్గాప్రసాద్, ఇన్‌చార్జి మేనేజర్ కె.మురళీధర్ తెలిపారు. ప్రస్తుతం మొదటి అంతస్తులో 32గదులు ఉన్నాయి. మరో అంతస్తు నిర్మాణంతో కొత్తగా 24గదులు అందుబాటులోకి వస్తాయన్నారు. రెండో అంతస్తుకు లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. దిండి రిసార్ట్‌లో ప్రస్తుతం 32గదులు ఉండగా కొత్త నిర్మాణాలతో మొత్తం 56గదులు అందుబాటులోకి వస్తాయి. రెండు నెలల్లో వీటితో పాటు మిగిలిన పనులను ఆధునికీకరణ చేస్తున్నట్టు తెలిపారు.

డీజిల్ లూజ్ అమ్మకాలు నిలిపివేస్తే ఆక్వా సాగుకు నష్టాలు

అల్లవరం, మే 19: బంకుల్లో డీజిలు లూజు అమ్మకాలు నిలిపివేస్తూ తీసుకున్న చర్యలతో ఆక్వా సాగులో రైతులకు తీవ్ర నష్టాలు వాటిల్లుతాయని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. సక్రమంగా విద్యుత్ సరఫరా లేక ఆక్వా సాగు ఇబ్బందుల్లో ఉందన్నారు. రొయ్యలకు ఆక్సిజన్ అందకుంటే చనిపోతాయన్నారు.